

# దేవత

కొల్లిపాటి విజయలక్ష్మి

"అస్సలు నువ్విలాటి వాడివని అనుకో లేదు." జడ వెనక్కి వీపుమీదికి విసురుకొంటూ రోషంగా అంది శైలజ.

"ఎలాటివాణ్ణి అనుకున్నావ్?" అతని గొంతులో వెక్కిరింపు.

"మాట నిలకడలేనివాడివని, మోప గాడివని" నువ్వు నువ్వు.... ఇలా మళ్లీ పెళ్లికి సిద్ధమౌతావని అనుకుంటే కనీసం ఊహించి వుంటే....", ఆమె గొంతు దుఃఖంతో, రోషంతో మూగపోయింది. పైపంటి క్రింద క్రింది పెదవి నొక్కబడింది.

జలజలా కన్నీళ్ళు చెక్కిల మీంచి జారిపోయాయ్.

"ఊ. అనుకుంటే? ఊహించి ఉంటే ఏం చేసేదానవు?" కనుబొమలు చిట్లించి ప్రశ్నించాడు ప్రసాద్.

"నిన్ను ప్రేమించేదానను కాను. స్నేహం చేసేదానను కాను. అసలు మాట్లాడేదానను కాను. కనీసం నీవైపు కన్నెత్తి చూసేదానను కాను. నువ్వో నీచుడవని నీతినిజాయితీ లేనివాడివని, పువ్వులాటి నా జీవితం నాశనంచేసే ఓ పురుగువని, ఓ కుక్కవని...."

"షటప్" ఆమె చెంప ఛెళ్ళుమంది.

చెంప కందింది. కనులు ఎరుపెక్కాయ్. "రాస్కెల్ నా మీద చెయ్యి చేసుకునే అధికారం నీ కెవరిచ్చారు?" అరిచినట్లడిగింది.

"నా వెంట నువ్వు వచ్చినవాడే నాకా అధికారం వచ్చింది." మొండిగా నవ్వాడతను.

'నేనెంత అవివేకంగా ప్రవర్తించాను: నాకు బుద్ధిలేదు.' స్వగతంలా అనుకొందామె.

"ఫస్టు ఎండ్ ఫైనల్ చెబుతున్నాను. అనవసరంగా అల్లరిచేసి గోలచెయ్యకు. చేస్తే నువ్వే నవ్వులపాలవుతావు. నాకేం లేదు" భుజాలెగరేసి నవ్వాడు ప్రసాద్.

"ముందు తొందరగావెళ్ళిపో ప్రసాద్. నాకు పిచ్చెక్కేటట్టుంది. నవ్వింకా చంపకు. నేనేమిటో సహించలేకపోతున్నాను. నిన్ను నమ్మాను ప్రసాద్.... నీలాటి మనిషే లేడనుకున్నాను. నువ్వు దేవుడవని గుడ్డిగా నమ్మాను ప్రసాద్.... వెళ్ళిపో నాకు వీలయినంత దూరంగా వెళ్ళిపో. నాకు కనుపించకు నువ్వు.... నువ్వు నీ కొత్త భార్యా హాయిగా బ్రతకండి." దోసిట్లో ముఖం దాచుకు వెక్కివెక్కి ఏడవటం ప్రారంభించింది శైలజ.

"కొత్త భార్య." అని నొక్కి పలికి, "నువ్వు పాతభార్య వనుకొంటున్నావు కదూ! పలుగురితో చెప్పి చివాట్లేయిస్తే లొంగుతానని, చిలవలుపలువలగా సిగ్గు లేకుండా కథలు చెప్పకు. తిరిగావ్ అనుభవించు. నువ్వు ఒక ఆడదానివని గుర్తుంచుకో...." విసురుగా అవతలికి వెళ్ళిపోయాడు ప్రసాద్.

భళ్ళున తలుపులు మూసి బోర్లా మంచంమీద పడుకొని బేలగా ఏడుస్తోంది డాక్టరు శైలజ.

గడచిపోయిన కమ్మని గతం ఆమెను వెక్కిరించసాగింది.

* * *

విశాఖపట్నం మెడికల్ కాలేజీలో తనూ ప్రసాద్ చదివే రోజులు. తన కన్నా రెండేళ్ళు పెద్దవాడయిన ప్రసాద్ మూడవ సంవత్సరం తప్పటంతో తనతో కలిశాడు. శవాన్ని చూస్తూనే భయపడే తను, తనకు ధైర్యంచెప్పి "ఇలాఅయితే ఎలా అవుతావు డాక్టరువి. మనిషిని మరలా చూడాలి. అంతే. శవాన్ని చూసి భయపడే నువ్వు ఈ చదువుకెందుకు సిద్ధమయ్యావు." ఎన్నో తియ్యని కబుర్లు చెప్పి తనకు ధైర్యం నూరిపోసేవాడు. క్రమంగా అతని వైపు ఆకర్షితురాలయిపోయింది.

తనూ ప్రసాద్ క్లోజ్‌గా తిరగటంతో కోస్టూడెంట్లు చెవులు కొరుక్కునేవారు. గిరిజ మరీనూ. "శైలూ, జాగ్రత్త. కాలు జారేవు సుమీ! మీ పెళ్ళికి మీ అమ్మగారు సుతేమిరా అంగీకరించదు." అని చాలాసార్లు హెచ్చరించింది కూడా. ఏమిటో అప్పట్లో తనకు ఎవరు చెప్పినా హితోక్తులయినా చేదుగా ఉండేవి. గిరిజకి సీరియస్‌గా చెప్పేసింది ఓ సారి. "నా వ్యక్తిగతవిషయాల్లోజోక్యంపెట్టుకోకు" అని. గిరిజ ముఖం చిన్నబోయింది. కత్తివాటుకి నెత్తురుచుక్క లేదు. చాలా రోజులు తనతో ముభావంగా ఉండిపోయింది. హౌస్సర్జను చేసే రోజుల్లో ఓసారిఅంది మళ్ళీ."ప్రసాద్ ఏమీ నమ్మదగినవ్యక్తిలా అనిపించడు నాకు. ఇప్పటికయినా మించిపోయింది లేదు. స్నేహం స్నేహంలానే మిగిలిపోనీ. ఇంకేవేవో ఆశలు పెంచుకోకు." అని. "నాకు తెల్సు లేవోయ్ నువ్వేం చెప్పక్కరలేదు" అనేసింది. ప్రసాద్‌ను తరచు తమ ఇంటికి తీసుకువెళ్ళి టిఫిన్లు, భోజనం పెట్టేది. మొదటిసారి తను ప్రసాద్‌ని తమఇంటికి తీసుకువెళ్ళినప్పుడు తల్లీచెల్లెళ్లూ అన్నయ్యా అంతా అడిగారు. "ఎవరా అబ్బాయి! ఏ ఊరు" అని, వివరాలన్నీ తను గబగబా చెప్పేసింది. చివర్న చాలా మంచివాడు అంది. ఓహో అలానా అంది తల్లి.

తర్వాత "అమ్మాయ్ అతనితో తిరగటం, చనువు నాకేం నచ్చటంలేదు అంది తల్లి." "ఫర్వాలేదులే అమ్మా! కొంపలు మునిగిపోవు" అని నవ్వేసింది తను.

విశాఖ బీచిలో గంటలు గంటలు గడిపేవారు తనూ ప్రసాద్. అతను ముందు తనచేతులు ముద్దుపెట్టుకునేవాడు. తర్వాత బుగ్గలు, ఆ తర్వాత.... ఆ తర్వాత— కనులు గట్టిగా మూసుకుంది శైలజ. "నిన్ను పెళ్ళిచేసుకొంటాను. ప్లీజ్ ఆగలేను. చచ్చిపోతాను." అన్నాడు తర్వాత అతనితో సినిమాకు వెళ్ళింది. భోజనం హోటల్లోనే చేశారు. అదే హోటలుగదికి వెళ్ళింది అతని వెనుక "కాస్సేపు కూర్చుని వెళ్ళిపోదాం అంతే" అని అతనంటె మంత్రముగ్ధలా అతని వెనుక నడిచింది.

అతనికి లొంగిపోయింది. తన సర్వస్వం అతని కర్పించింది.

తర్యాత పరిపాటయింది.

చదువు అయిపోయింది. అతను అతని పల్లెటూరువెళ్ళి ప్రాక్టీసు పెడతానన్నాడు.

తను అడిగింది నన్ను పెళ్ళిచేసుకుపో అని.

"ఇప్పుడు పెళ్ళికి వీలవదు. మావాళ్ళు వప్పుకోరు. నాతో వచెయ్" అన్నాడు.

ఆమె దిమ్మెరపోయింది. ఇంతకాలం తనవాళ్ళు అంగీకరించరనే అనుకుంది. ఫర్వాలేదు అతనితో వెళ్ళిపోయి పెళ్ళి చేసుకుంటాను అనుకుంది. ఇప్పుడు అతను అతనివాళ్ళని ఎదిరించలేడూ! ఉంపుడుగత్తెగా అతనివెంట వచ్చెయ్యమంటున్నాడా?

తనతల్లి ఎంత మొత్తుకుని ఏడ్చింది? "నీ వెనుక పుట్టినవారి గురించి ఆలోచించు. మేము సంఘంలో తలెత్తుకు ఎలా తిరగాలో ఆలోచించు. కుటుంబానికి అప్రతిష్ట తేకు. అతన్ని పెళ్ళిచేసుకోవద్దు. మన కులంవాడు కాదు. మాంసాహారి. నీకూ అతనికీ పొత్తుకుదరదు." శతవిధాల చెప్పి ఏడ్చింది. అందరూ చీవాట్లేశారు. నిన్ను చదివించింది ఇందుకా, నీ మానాన్ని నువ్వు పోవటానికా? కుటుంబాన్ని ఆదుకోవా! చెల్లెళ్ళ తమ్ముళ్ళ చదువు, కుటుంబభారం కొంచమయినా భుజాన వేసుకోవా! అప్పె చదువు అబ్బక గుమస్తాగిరీలో స్థిరపడిన అన్నయ్య అడిగాడు. "మీ అందరికోసం అతన్ని నేను వదులుకోను". అని ఖచ్చితంగా చెప్పేసింది. చెంప ఛెళ్ళుమనిపించాడు అన్నయ్య. "పో చండాలపుదానా"! అని మెడమీద చెయ్యేసి గుమ్మం బయటకు నెట్టాడు. తల్లి తల కొట్టుకుంది.

"ఊరుకోమ్మా! కన్నపిల్ల లందరూ సంతోషానివ్వరమ్మా! ఒకే పిల్లవలన బాధకలిగినా సహించాల్సిందే! పోనీ మనపాట్లేవో మనం పడదాం" అని తల్లిని ఓదారా డతను.

కట్టుబట్టలతో, తన చదువుకు సంబంధించిన కాయితాలతో, శాశ్వతంగా తనవాళ్ళకి, ఆ ఇంటికి దూరమయిపోయింది.

"నాతో వచ్చెయ్. నీకో ఇల్లుచూపి ఉంచాను. ఉందువుగాని. ప్రాక్టీసుచేద్దువుగాని. నెమ్మదిగా మావాళ్ళకు నచ్చచెప్పి పెళ్ళిచేసుకుంటాను. నేను ఇంటికి పెద్దవాణ్ణి. నాకు పెళ్ళి కావాల్సిన చెల్లెళ్ళు ఇద్దరున్నారు. నాన్నగారు పెద్దవారయిపోయారు. అమ్మకి కుంటుంబ మర్యాదలంటే ప్రాణం. వాళ్ళని కష్టపెట్టలేను" అని ప్రసాద్ సోదిచెబితే తనకు వళ్ళు మండిపోయింది. కానీ ఏం చెయ్యగలదు? నిస్సహాయంగా కన్నీరు కార్చింది. తన కోసం అతను అతనివాళ్ళను వదులు



కోలేదు. తనుమాత్రం అందరినీ వదిలేసుకుంది.

అభిమానంలేదు. సరే, తనకు విశ్వాసం కూడా లేదు. తనకి శాస్తి కావలసిందే. ప్రాక్టీసుకు కావలసిన హంగులన్నీ అమర్చారు తామిద్దరూ కలసి. ప్రాక్టీసు ప్రారంభించారు. పల్లెటూరు కావటాన తమఇద్దర్ని సంబంధంను కథలు కథలుగా అల్లుకుని గుప్పుమంది 'నాయుడుగోరి అబ్బాయి ముండని తెచ్చుకున్నాడు. ఆ యమ్మ డాక్టరేనంట' అని. తను చాలా సిగ్గుపడింది తను ముండా! అతని ఉంపుడుగత్తా? ఎంతకి దిగజారింది! తన కుటుంబ సాంప్రదాయం, చదువు, ఈ చదువు తనకిచ్చిన సంస్కారమా ఇది?

సన్నగా తలనొప్పి ప్రారంభమయింది శైలజకు. కణతలు బరువుగా రుద్దుకుంది. కనులు గట్టిగా మూసుకుంది.

• • •

"అమ్మగోరూ! డాక్టరమ్మగోరూ!"

శైలజ గతం చెదరిపోయింది. కనులు, ముఖం పవిటచెంగుతో తుడుచుకుని లేచి తలుపుతీసింది.

"అమ్మాయికి నెప్పులు వస్తునాయమ్మా. మంత్రసాని డాక్టరమ్మని పిలవాల అంది." చేతులుజోడించి ఎదురుగా నిల్చున్న నడివయస్సు దాటిన ఆమెను చూసి "పద" అంది శైలజ. గజేంద్రుణ్ణి కాపాడే విష్ణువులా ఉన్నపాటున ఆమె వెంట బయలుదేరిపోతూ.

"అమ్మగోరూ పెట్టె,అదీ....మందులు ఇంజక్షను సూదీ," అని ఆ వచ్చిన ఆమె డాక్టరువైపు చూసింది.

డెలివరీకేసు చూడ్డానికి తను వెళ్లేప్పుడు తీసుకువెళ్ళే బాక్సు ఆమె చేతికిచ్చి తలుపుకి తాళంపెట్టింది శైలజ.

ఆమె మనస్సేమీ బాగాలేదు. ఈ సమయంలో వంటరితనం అస్సలు భరించలేదు. తన వృత్తిలో తను లీనమవాలి. జీవితంలో ఏవో సుఖాలవైపు మనస్సుని పరుగెట్టనీయకూడదు. అని తనకు తాను బుద్ధులు చెప్పుకుంటూ అన్యమనస్కంగానే నడిచింది శైలజ.

ఆమె ప్రాక్టీసు ఇప్పుడిప్పుడే పుంజుకుంటూంది. ఇప్పటివరకూ ఆ ఇద్దరి సంపాదనా ప్రసాదే తీసుకుంటున్నాడు.

ఇవ్వాళ ఫీజు తీసుకున్న తర్వాత అనుకుంది శైలజ. ఇవ్వాళ్టినుంచీ ప్రసాద్ తనకేమీకాడు. తన సంపాదం అతని కివ్వదు. తన కుటుంబానికి సాయం చేస్తుంది.

నాలుగురోజులు గడిచాయి. ప్రసాద్ డిస్పెన్సరీకి రాలేదు. రోగుల్ని ఆమే ట్రీట్ చేస్తోంది. డాక్టరుబాబుగారు రాలేదమ్మా అని అడిగేవారికి, రాలేదు అని పొడిగా జవాబు చెబుతూంది. కాని అతని ఉద్దేశ్యమేమిటి? అనే ప్రశ్న ఆమెను వేధిస్తూంది.

అవ్వాళ పోస్టులో శుభలేఖ వచ్చింది శైలజకి. కవరులోంచి మెరుపు డిజైన్ల కార్డుతీసి చదివింది. నీరు నిండిన కనులకు మసకమసకగా అక్షరాలు అల్లుకుపోయినట్లు కనిపిస్తున్నాయి.

చప్పున కనులు వత్తుకుని చదివింది. 'డాక్టర్ ప్రసాద్‌కు లక్ష్మినిచ్చి, అపయిన ఆమెకు చదవాలనిపించలేదు. కవరు డ్రాయర్లో పడేసింది.

ఆ రోజు, ఆ మర్నాడుకూడా అన్నం సయించలేదు. నిద్రపట్టలేదు. ఏదో తెలియని విరక్తి, నైరాశ్యం ఆమె మనస్సు నాక్రమించాయి.

ఎన్నెప్పటికయినా పెళ్ళి చేసుకుంటానని నమ్మించి తనను సర్వనాశనం చేసిన ప్రసాద్, అతనికీ తనకి పెళ్ళికావటానికి ఎన్నిసాకులు చెప్పారు! "నా చెల్లెలుకి ఏభై వేలు కట్నమడిగారు, ఇప్పుడు నాకు లక్షరూపాయలు కట్నంగా ఇస్తామని సంబంధాలు వస్తున్నాయి. లక్ష కట్నం తీసుకుంటే చెల్లెలు పెళ్ళి అయిపోతుంది. నా చదువుకోసం మావాళ్ళు ఇల్లువాకిలీ అమ్ముకున్నారు. పోనీ నువ్వు ఆ లక్ష రూపాయలూ ఇవ్వగలవా!" ఆ ప్రశ్నలో ఎగతాళి "అసలు" నిన్ను పెళ్ళిచేసుకుంటే నా చెల్లెలుకి పెళ్ళి అవదు సంబంధాలు రావు" అంటే, తనంత ధైర్యంచేసి "ఇవ్వన్నీ ముందే ఆలోచించాల్సింది. ఇన్నేందుకి ఊబిలో దించావ్" అని అడిగింది.

"నేనేం దించలేదు. నువ్వే దిగావు. నేను కాకపోతేఅప్పుడు మరొకడికి వళ్ళు అప్పగించేదానవు." ఎంత అసహ్యంగా మాట్లాడేడు!

"దోంటాక్" అరిచింది తను. అతను విరగబడి నవ్వాడు.

ప్రసాద్‌కి పెళ్ళి అయిపోతూంది. తనకింక జన్మలో పెళ్ళికాదు తను ఎవ్వరి భార్యా కాదు. వ్యక్తిగా తనకెలాటి విలువా లేదు. అందరికీ తానంటే చులకన భావమే ఉంటుంది. దీర్ఘంగా నిట్టూర్చింది శైలజ.

• • •

రాత్రి తొమ్మిది దాటింది. డిస్పెన్సరీ మూసి బెడ్‌రూమ్‌లో కూర్చుని ఏదో పుస్తకం తిరగవేస్తూంది శైలజ.

సన్నగా కాళ్ళతో తలుపు తట్టిన చప్పుడు- ఆ శబ్దం ప్రసాద్ చేతి వేళ్లది. అతనలాగే టకటక చప్పుడు చేస్తాడు తలుపు తెరవమని.

ఎందుకో ఆమె గుండెల్లో దడ, తడబాటు, దుఃఖం, కోపం. రెండు నిమిషాలు తనను తాను నిగ్రహించుకుని, యాంత్రికంగా తలుపువైపు నడిచి గడియ తీసింది శైలజ.


లోపలికి వచ్చిన ప్రసాద్ ఆమె కనులకు కొత్తగా కనుపించాడు.

మౌనంగావచ్చి కుర్చీలో కూర్చుంది. అతనామె ఎదరకుర్చీలో కూర్చుని ఉన్న ఆమె ముఖంలోకి చూశాడు. అతనా ఇంటినుంచివెళ్ళి నెల దాటింది. ఆమె అతని పెళ్ళికి వెళ్ళలేదు. ఊర్లో

మామూలు సంఘటన!



సినిమాలో యిలా చూస్తాం!!




అతనిచ్చిన డిన్నరుకి హాజరు కాలేదు.

"బాగున్నావా?" అడిగాడు ప్రసాద్.

"నీ దయవలన," ఒక్కో అక్షరం, నొక్కి చెప్పింది శైలజ.

"బాగా కోపం వచ్చినట్లుంది."

"ఆఫ్టరాల్ ఒక ఆడది. ఎంత చదివిన దయినా, నీలా ఏ మగవాణ్ణీ ఏం చెయ్యగలదు?"

"పోనీ, మా చెల్లెలు పెళ్ళికి రా. ఇదిగో కార్డు" ఆమె మాట అతనికి వివి పించినట్లు ఓ కవరున్న చెయ్యి ఆమె ముందుకి చాపాడు.

"ఏం! అందరికీ నాతో లేచివచ్చినదని నన్ను పరిచయం చేస్తావా?" రోషంతో ఎర్రబారిన కనులెత్తి అతనివైపు చూస్తూ ప్రశ్నించింది శైలజ.

నవ్వాడతను, పెదవులు కదిలీకదల నట్లు.

"నీతో తగవుకి నాకు తీరికలేదు. కాని నాకిప్పుడు డబ్బు కావాలి. ఎంతుంది" అడిగాడు.

"ఏమీలేదు, నేనివ్వను."

అతను గలగలా నవ్వి, "కోపంలో నువ్వు చాలా బాగుంటావు. చెల్లెలుపెళ్ళి అయిపోయాక మా ఆవిణ్ణి పంపించి నిన్ను రిజిష్టరు మ్యారేజ్ చేసుకుంటాను శైలజా" అన్నాడు.

"అక్కరలేదు. నీలాటివాడికి భార్యనై, నీలాటి పిల్లల్ని కని సంఘానికి ద్రోహం చెయ్యను. నీ పిల్లలకు నేను తల్లిని కాలేను. ఛీ! ఇప్పుడు నామీద నాకే అసహ్యం. నేను నీకు రెండవ భార్యను కావాలా! అందుకామె పప్పు కోవాలా! వొద్దు."

"థాంక్స్. డబ్బెంతుందో ఇవ్వు పదివేల రూపాయలు అవసరం. ఇవ్వు ముందు."

"ఒక్క పైసా కూడా ఇవ్వను. అందుకా వచ్చినది ఇప్పుడు?" అంది శైలజ కోపం, ఆవేశం, దుఃఖం అన్నీ అణచుకొంటూ.


ఈ ప్రాక్టీసుకి మదుపెంత పెట్టానో తెలుసా!"

"తెల్సు. నాకివ్వాల్సినదానికి చాలా తక్కువ"

"అంటే? నీకు నేను ఇవ్వాల్సిం దేమిటి?" కనుబొమలుచిట్లించి ఆమెవైపు చురుగ్గా చూస్తూ అడిగాడు ప్రసాద్.

"నన్ను, నా శీలం, నా పరువుమర్యాదలు, నా బ్రతుకు అన్నీ దోచుకున్నావ్. ప్రసాద్ నువ్వేమిచ్చినా, నష్టపరిహారం కాదు. ఈ డిస్పెన్సరీ, ఈ బీర్వాలు—మందులూ—కుర్చీలూ—బల్లలు—అన్నీ నావి. ఇదేమాటఅంటాను నేను. ఇటుపైన నా ప్రాక్టీసు నాదే. నేను చాలా సంపాయించాను. నిన్ను నమ్మి అంతా నీకే ఇచ్చాను. ఇటుపైన నీకు నేనేమీఇవ్వను. రాస్కెల్! నువ్వు వచ్చి డబ్బు పట్టుకు పోదామనుకున్నావా?"

"ఎందుకు అనవసరంగా నోరుపారేసు కుంటావు! ఇస్తావా లేదా? బ్యాంకి బుక్ ఇలా పారెయ్," అన్నాడు లేచి నిల్చుంటూ.



ఆమె బీర్వాలోంచి పాస్‌బుక్ తీసి అతని కాళ్లముందుకి విసిరింది.

వంగి పుస్తకంతీసి చూశాడు. అది జాయింట్ ఎకౌంటు పుస్తకం. బాలన్సు 20 రూపాయలు ఉంది. అతను పెళ్లికిముందే అంతా విత్‌డ్రా చేసుకున్నాడు.

ఆమెవైపు చురుగ్గా చూశాడు. సంపాయించిన డబ్బు ఏంచేస్తున్నావన్నట్లు.

"ఇటుపైన నీకూ నాకూ ఎటువంటి సంబంధమూ లేదు," వెళ్ళిపో.

"దయ్యం వదిలింది"అని గుండెలమీద చెయ్యంచుకుని తేలిగ్గా ఊపిరి పీల్చి వదిలి, "సరే రేపు ఇవన్నీ అమ్మి డబ్బు చేసుకుంటాను" అన్నాడు ప్రసాద్.

అతను అంతపనీ చెయ్యగలడనుకున్న శైలజ చేతికున్న రెండు బంగారు గాజులు, మెడలో ఉన్న వంటిపేట గొలుసూ, బీర్వాలోఉన్న కొన్ని రూపాయలూ అన్నీ అతనికిచ్చి "నన్ను నా మానాన బ్రతకనియ్ ప్రసాద్" అని చేతులు జోడించింది.

ప్రతినమస్కారంచేసి టకటకా బూటు శబ్దంచేస్తూ నడిచి వెళ్లిపోయాడతను.

* * *

ఆ ఊరినుంచి మకాం ఎత్తేసింది శైలజ. ఒక పల్లెటూరిలో ప్రాక్టీసు పెట్టింది. ఆరునెలలు గడిచినాయి.డబ్బూ పేరూ బాగా నేవస్తూంది డాక్టరు శైలజకి.

ఆత్మీయులు చెప్పిన హితోక్తులు వినకుండా అందర్నీ వదిలి వచ్చినందుకు తగిన శిక్ష అనుభవించానని సుదీర్ఘమైన ఉత్తరం వ్రాస్తూ, ఐదువేల రూపాయల చెక్కు పంపింది అన్నయ్యకు శైలజ.

నాలుగురోజుల తర్వాత చెక్కు తిరిగి వచ్చింది. చెక్కుతోపాటు ఒక ఉత్తరం కూడా వచ్చింది. ఆత్రతగా ఉత్తరంలోని అక్షర పంక్తులవెంట దొర్లాయి శైలజ చూపులు.

శైలూ :

థాంక్స్ ! చెక్కు తిరిగి పంపించినందుకు బాధపడకు. నీ డబ్బు కుటుంబ ఖర్చులకు స్వీకరించటానికి నా మనస్సంగీకరించలేదు. నీ ఉత్తరం సాంతం చదివాను. ఉత్త సానుభూతి తప్ప నా నుంచి నీకు లభించేదేమీ ఉండదు.

నువ్వు వెళ్ళాక, అమ్మ పాతకాలపు మనిషేమో, బాగా సిగ్గుపడిపోయేది తానే ఏదో తప్పుచేసినట్లు. అత్తయ్య పద్మజని హరికి చేసుకోలేనని ఖచ్చితంగా చెప్పేసింది. అత్తయ్య పద్మజని తనకోడల్ని చేసుకుంటానని నాన్నగారి దగ్గర ప్రమాణం చేసింది, ఎందుకు మానేసిందంటావ్ ?

అమ్మ నాలుగురోజుల జ్వరంతో ఓ రోజు రాత్రి ఆత్మహత్యో ఏమో మరి కన్నుమూసింది.

ఇప్పుడు అందరం పైసో పరకో గౌరవంగా సంపాయించుకుంటున్నాం. నీ డబ్బు మాకు అవసరంలేదు.

శీతారాం

శీతారాం అని పెదవివిరచి విరక్తిగా నవ్వుకుంది శైలజ. శైలూ అని ఆప్యాయంగా పలకరించే అన్నయ్య. నీ అన్నయ్య అని సంతకం పెట్టలేకపోయాడు.

ఎవరో పేషంట్లు రావటంతో, ఉత్తరం టేబిలుమీద పడేసి పేషంట్లు ఒక్కొక్కరినే చెకప్‌చేసి ప్రిస్క్రిప్షన్సు వ్రాసి ఇచ్చింది శైలజ.

అయితే, వారు ఇవ్వబోయే మామూలు ఫీజు ఐదురూపాయలు మాత్రం తీసుకోలేదు. ఇవ్వాల్టినుంచీ నేను ఫీజు తీసుకోవటంలేదని చెప్పేసింది శైలజ.

కృతజ్ఞతాభావంతో కనుల్లో ఆనందం తొణికిసలాడుతూంటే నమస్కరించారు రోగులు, అమ్మ దేవత అనుకుంటూ.

ఆనాటినుంచీ ఆమె ఉచితవైద్యమే చెయ్యటం ప్రారంభించింది. అందరూ ఆమెను దేవత అంటారు. ఆమె దేవతగా ఎందుకు మారిందో ఎవరికీ తెలియదు.

———

